# ఐబొమ్మ..రీ ఓపెన్ !

-కొత్త మూవీలతో కళకళలాడుతున్న పైరసీ సైట్
-వెబ్‌సైట్ పునరుద్ధరణతో సినీ పెద్దల విస్మయం
-సాంకేతికతను వాడుకుంటూ డొమైన్లను మారుస్తున్న ముఠా
-నెట్‌వర్క్‌ను ఛేదించడం పోలీసులకు సవాల్




హైదరాబాద్
టాలీవుడ్‌ను పైరసీ భూతం మళ్లీ వెన్నాడుతోంది. ఒకవైపు డిజిటల్ విప్లవం, మరోవైపు పైరసీ సైట్ల దాడితో కుదేలవుతున్న చిత్ర పరిశ్రమకు ఐబొమ్మ రూపంలో మరో భారీ షాక్ తగిలింది. ఈ సైట్ నిర్వాహకుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రవి అరెస్ట్ కావడంతో ఇక ఐబొమ్మ అధ్యాయం ముగిసిందని అంతా భావించారు. కానీ, ఎవరూ ఊహించని విధంగా రవి బెయిల్‌పై విడుదలైన కొద్ది రోజులకే ఆన్‌లైన్‌లో మళ్లీ ఈ సైట్ ప్రత్యక్షమవ్వడం ఇప్పుడు ఇండస్ట్రీలో కలకలం రేపుతోంది. గతంలో ఐబొమ్మ రవిని పోలీసులు అరెస్ట్ చేసినప్పుడు పైరసీకి అడ్డుకట్ట పడుతుందని నిర్మాతలు ఊపిరి పీల్చుకున్నారు. అప్పట్లో సైట్ పూర్తిగా నిలిచిపోయింది. అయితే, తాజాగా వెబ్‌సైట్ పునరుద్ధరించబడటమే కాకుండా, థియేటర్లలో ఉన్న కొత్త సినిమాలు సైతం అందులో ప్రత్యక్షమవ్వడం పట్ల సినీ పెద్దలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రవి బెయిల్‌పై రావడం, వెంటనే సైట్ ఆపరేషన్లు మొదలవ్వడం వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను ఛేదించడం పోలీసులకు సవాలుగా మారింది. సాంకేతికతను వాడుకుంటూ డొమైన్లను మారుస్తూ వస్తున్న ఈ పైరసీ ముఠాను అరికట్టడంలో ఎక్కడ లోపం జరుగుతుందనే చర్చ మొదలైంది. ఇప్పుడు పోలీసులు మళ్లీ రవి కోసం వేట మొదలు పెట్టారు.

# సోనియాకు.. అస్వస్థత

మొదటి తరువాయి

**కేరళ పర్యటనను రద్దు చేసుకుని..**
సోనియా గాంధీ ఆసుపత్రిలో చేరారన్న వార్త తెలియగానే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన కేరళ పర్యటనను రద్దు చేసుకుని హుటాహుటిన ఢిల్లీకి చేరుకున్నారు. కోజికోడ్ లో జరగాల్సిన ర్యాలీలో వర్చువల్ గా పాల్గొంటూ.. "ఒక కొడుకుగా నా తల్లి ఆరోగ్యం పట్ల ఆందోళన చెంది ఇక్కడే ఉండాలని నిర్ణయించుకున్నాను. కేరళ ప్రజలు నా పరిస్థితిని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను" అని భావోద్వేగంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో తన తల్లిని ప్రతి గంటకూ పర్యవేక్షిస్తూ తనకు ధైర్యాన్నిచ్చిన ఓ కేరళ నర్సు గురించి రాహుల్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత కొన్నేళ్లుగా సోనియా గాంధీ తరచూ ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది మార్చి 24న జ్వరం, ఇన్ఫెక్షన్ కారణంగా గంగారామ్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. అలాగే గతేడాది జూన్ 7న, అంతకుముందు కూడా జీర్ణకోశ సంబంధిత సమస్యలతో పలుమార్లు ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. తాజాగా మరోసారి వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వెళ్లడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అయితే ప్రస్తుతం సోనియా గాంధీ క్షేమంగా తిరిగి రావడంతో పార్టీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నాయి.

# హిందూయిజం ఒక జీవన విధానం

మొదటి తరువాయి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్, జస్టిస్ ప్రసన్న బీ వరాలే, జస్టిస్ ఆర్ మహాదేవన్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ కూడా ఉన్నారు.
శబరిమల ఆలయ ప్రవేశ తీర్పు – పునఃసమీక్ష పిటిషన్లపై విచారణ
శబరిమల ఆలయ ప్రవేశ తీర్పును 2018 సెప్టెంబర్ 28న సుప్రీంకోర్టు ఇచ్చింది. అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. 10 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలను శబరిమల ఆలయంలోకి అనుమతించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని 4:1 మెజారిటీతో ఆనాడు సుప్రీంకోర్టు బెంచ్ తీర్పు ఇచ్చింది. 2018 నాటి ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పునఃసమీక్ష పిటిషన్లపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది. దీనిపై తమ వాదనలను కూడా వినాలంటూ పలువురు మధ్యంతర పిటిషన్లు దాఖలు చేశారు. ఈ విచారణలో భాగంగా బుధవారం మధ్యంతర పిటిషన్ దాఖలు చేసిన ఒక పక్షం తరఫున అడ్వకేట్ డాక్టర్ జీ. మోహన్ గోపాల్ వాదనలు వినిపించారు.

**ఇప్పుడందరూ వేదాలను అంగీకరిస్తున్నారా?**
"హిందూ మతంలోని పలు వర్గాల నుంచే సామాజిక న్యాయం కోసం డిమాండ్ వస్తోంది. హిందూయిజాన్ని ఒక మత వర్గంగా నిర్వహించారు. మతం, తత్వశాస్త్రానికి సంబంధించిన అన్ని విషయాల్లో వేదాలను అత్యున్నత ప్రమాణంగా అంగీకరించేవాడే హిందువు అని 1966లో తీర్పు ఇచ్చారు. హిందువులందరి అభిప్రాయాలను తీసుకోకుండానే గతంలో కోర్టులు ఈవిధంగా ఒక నిర్ణయానికి వచ్చాయి. హిందువుల్లో ఎవ్వరూ ఎప్పుడూ అలా చెప్పలేదు. నాకు వేదాల పట్ల అత్యంత గౌరవం, గొప్ప ఆరాధనా భావం ఉన్నాయి. కానీ, నేడు హిందువులుగా పరిగణించే ప్రతి ఒక్కరూ అన్ని ఆధ్యాత్మిక, తాత్విక విషయాల్లో వేదాలను అత్యున్నత ప్రమాణంగా అంగీకరిస్తున్నారన్నది వాస్తవమేనా?" అని మధ్యంతర పిటిషన్ దాఖలు చేసిన ఒక పక్షం తరఫున అడ్వకేట్ డాక్టర్ జీ. మోహన్ గోపాల్ సుప్రీంకోర్టులో వాదన వినిపించారు.

**అందుకే హిందూ మతాన్ని జీవన విధానం అంటారు**
ఈ వాదనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న స్పందిస్తూ, "అందుకే హిందూ మతాన్ని ఒక జీవన విధానం అంటారు. ఒక హిందువు హిందువుగా ఉండటానికి తప్పనిసరిగా గుడికి వెళ్లడం గానీ, ఏదైనా ఆచారం పాటించడం గానీ అవసరం లేదు" అని ఆమె పేర్కొన్నారు. "ఆచారబద్ధంగా ఉండాల్సిన అవసరం లేదు. ప్రజలు తమ విశ్వాసాన్ని కలిగి ఉండటానికి ఎవరూ అడ్డు రాలేరు" అని జస్టిస్ నాగరత్న తెలిపారు. "ఒక వ్యక్తి హిందూ మత విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి, గుడిసెలో దీపాన్ని వెలిగించుకున్నా సరిపోతుంది" అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈ సందర్భంగా కీలక వ్యాఖ్య చేశారు.

# కేంద్ర ప్రభుత్వమే పొదుపు చేయాలి

మొదటి తరువాయి

ఇంకా వారికి ప్రాధాన్యం ఉందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీ కలిసి పోటీ చేసినా కాంగ్రెస్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. మూడు పార్టీలు కలిసి వచ్చినా తెలంగాణలో 30 శాతం ఓట్లను దాటలేవని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి పదవి కంటే పీసీసీ చీఫ్‌గా పనిచేయడంలోనే తాను ఎక్కువ సంతోషం, గర్వం పొందుతున్నానని మహేష్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# ఉబర్ ఎక్సలెన్స్ సెంటర్ విస్తరణ

మొదటి తరువాయి

ఖోస్రోషాహి వివరించారు. హైదరాబాద్‌లో ఉబెర్ ఎక్సెలెన్స్ సెంటర్ ను విస్తరిస్తున్నట్టు ఆయన తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేననీ, ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నట్టు ప్రకటించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆయన ముందుకు వచ్చారు. భవిష్యత్తులో మరింత విస్తరణకు ఆసక్తిగా ఉన్నామని దారా ఖోస్రోషాహి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం ఉండాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటు పై దృష్టి సారించాలని ఉబెర్ ప్రతినిధులకు సీఎం సూచించారు. మెట్రో స్టేషన్ల దగ్గర తగిన పార్కింగ్ సౌకర్యం లేదని తెలిపారు. దీని వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈవీ చార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సీఎం సూచించారు. ముఖ్యమంత్రి సూచనపై తప్పకుండా అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధి బృందం తెలిపింది.
హైదరాబాద్‌కు సమీపంలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉబెర్ ప్రతినిధులకు వివరించారు. 30 వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైనదన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామనీ, ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలోనే ఫ్యూచర్ సిటీ ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గత డిసెంబర్‌లో ఇక్కడ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో 100కు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి సీఈఓ దారా ఖోస్రోషాహి ఆసక్తి చూపించారు. ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (సీబీవో) మధు కన్నన్, ఉబెర్ ఇండియా సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# బలపరీక్షలో నెగ్గిన విజయ్

మొదటి తరువాయి

ప్రభాకర్ ప్రకటించారు.
మే 13వ తేదీలోగా మెజారిటీ నిరూపించుకోవాలని గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ ఆదేశించిన నేపథ్యంలో బుధవారం 'ఫ్లోర్ టెస్ట్' నిర్వహించారు. విశ్వాస పరీక్షపై తీర్మానాన్ని సీఎం విజయ్ ప్రవేశపెట్టారు. తమిళనాడు అసెంబ్లీ చర్చ సందర్భంగా తొలుత మాట్లాడిన కాంగ్రెస్ సభ్యులు తాము విజయ్‌కు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. విజయ్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకున్న తొలి మూడు నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేశారు. ఆ తర్వాత వామపక్షాలు విజయ్‌కు మద్దతు ప్రకటించాయి. సీఎం విజయ్ ప్రమాణస్వీకారానికి ముందు గవర్నర్ అర్లేకర్ పలుమార్లు తిరస్కరించిన తీరుపై సీఎం అభ్యంతరం వ్యక్తం చేసింది. తమిళనాడులో గవర్నర్ రూల్ను అడ్డుకోవాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం తమిళనాడు హక్కులను కాలరాస్తోందని సీపీఐ ఆరోపించింది. విజయ్ ఐదేళ్లపాటు కొనసాగాలని వీసీకే ఆశాభావం వ్యక్తం చేసింది. అయితే ఓఎస్డీగా వ్యక్తిగత జ్యోతిష్యుడిని విజయ్ నియమించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. విజ్ఞానశాస్త్రానికి సీఎం అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఏఐఏంఏంకే బహిష్కృత ఎమ్మెల్యే



కామరాజు సైతం విజయ్‌కు మద్దతు ఇచ్చారు. ఒక్క ఎమ్మెల్యే ఉన్న డీఎండీకే సైతం విజయ్‌కు మద్దతు తెలిపింది.

**డీఎంకే వాకౌట్ :**
డీఎంకేతో పాటు అన్నాడీఎంకే పళనిస్వామి వర్గం వ్యతిరేకించాయి. బలపరీక్షకు ముందుగానే విజయ్, తమిళనాడు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ ఆరోపించారు. 65 శాతం తమిళనాడు ఓటర్లు విజయ్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారని పేర్కొన్నారు. తమ కూటమి పక్షాలతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తారని విజయ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తమిళనాడులో రీల్ ప్రభుత్వం కాకుండా రియల్ ప్రభుత్వం ఉండాలని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఓటింగ్‌కు దూరంగా ఉంటామని చెబుతూ 59 ఎమ్మెల్యేలు ఉన్న డీఎంకే వాకౌట్ చేసింది.

**తటస్థంగా బీజేపీ :**
అయితే బీజేపీ మాత్రం ఈ ఓటింగ్‌లో 'తటస్థంగా' ఉండాలని నిర్ణయించింది. అన్బుమణి రామదాస్ నేతృత్వంలోని పీఎంకే ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నట్లు వెల్లడించింది. మరోవైపు అన్నాడీఎంకే పళనిస్వామి వర్గం విజయ్‌కు ఓటు వ్యతిరేకంగా ఓటు వేస్తామని ముందే చెప్పింది. విజయ్ ప్రభుత్వం తమ పార్టీలోని కొందరు ఎమ్మెల్యేలకు డబ్బు ఆశ చూపి ఆకర్షించే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. మరోవైపు అన్నాడీఎంకే షణ్ముగం వర్గం పళనిస్వామి వ్యాఖ్యలను ఖండించింది. 25 మంది షణ్ముగం వర్గం ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మొదటి తరువాయి

ఒకవైపు భగ్గుమంటున్న ఎండలు, మరోవైపు ఈదురు గాలులు, ఉరుములు–మెరుపులతో కూడిన అకాల వర్షాలు సంభవించే పరిస్థితులు ఉన్నందున ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, తదుపరి రోజుల్లో జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో కూడా ఎండల తీవ్రత పెరిగే అవకాశముందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయటకు రావద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని, ఎండలో పనిచేసే వారు తలకు రక్షణ కల్పించే వస్త్రాలు ధరించాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. వడదెబ్బలు, ఎండ తీవ్రత కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, అంబులెన్సులు, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు.గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ వడదెబ్బ నివారణ చర్యలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. రైతులు, కూలీలు, నిర్మాణ కార్మికులు, రహదారులపై పనిచేసే కార్మికులు ఎండ తీవ్రత సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఈదురు గాలులు, ఉరుములు–మెరుపులు సంభవించే ప్రాంతాల్లో ప్రజలు చెట్ల కింద నిలబడకుండా, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

# విరాట్ సూపర్ సెంచరీ

మొదటి తరువాయి



రాణించడంతో కోల్‌కతా నిర్ణీత ఓవర్లలో 192/4 స్కోరు చేసింది. వరుసగా నాలుగు విజయాల తర్వాత కేకేఆర్‌కు ఇది తొలి ఓటమి కాగా ఓవరాల్‌గా ఆరో పరాభవంతో ప్లేఆఫ్స్ అవకాశాలను దాదాపుగా వదులుకుంది.

**కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్**
ఛేదనలో బెథెల్ (15) మరోసారి తేలిగ్గానే వికెట్ సమర్పించుకున్నా గత రెండు మ్యాచ్‌ల్లో డకౌట్ అయిన కోహ్లీ.. ఈసారి రెచ్చిపోయి ఆడాడు.
వైభవ్ తొలి ఓవర్లోనే నాలుగు బౌండరీలు బాదిన రన్ మెషీన్.. పడిక్కల్ అండగా చెలరేగి ఆడాడు. 21 పరుగుల వద్ద అతడు ఇచ్చిన క్యాచ్‌ను కవర్స్ వద్ద పావెల్ జారవిడవడంతో ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న కోహ్లీ.. ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. వరుస బౌండరీలతో పరుగుల వేటకు దిగిన పడిక్కల్ సైతం బ్యాట్ ఝుళిపిస్తూ బౌండరీలతో రెచ్చిపోగా పది ఓవర్లలో బెంగళూరు 101/1తో సాఫీగా లక్ష్యం వైపుగా సాగింది.
అదే జోరుతో కోహ్లీ.. 32 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. అయితే రెండో స్పెల్‌లో బంతినందుకున్న కార్తీక్.. పడిక్కల్‌ను ఆఫ్ కట్టర్‌తో బోల్తా కొట్టించి 59 బంతుల్లోనే 92రన్స్ జోడించిన మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. రజత్ పాటీదార్ (11), టిమ్ డేవిడ్ (2) నిరాశపరిచినా కోహ్లీ మాత్రం రెచ్చిపోయి ఆడాడు. అనుకుల్ ఓవర్లో 4, 6తో 90ల్లోకి వచ్చిన అతడు.. అరోరా 19వో ఓవర్లో సింగిల్‌తో మెగా లీగ్‌లోరెండేళ్ల తర్వాత మరో సెంచరీని నమోదుచేశాడు. జితేశ్ (8 నాటౌట్)తో కలిసి లాంఛనాన్ని పూర్తిచేశాడు.

# రికార్డుస్థాయి కనిష్ఠానికి రూపాయి పతనం

మొదటి తరువాయి

డాలర్‌ను ఎగబడి కొనుగోళ్లు జరపడం రూపాయి పతనానికి ఆజ్యంపోశాయని ఫారెక్స్ ట్రేడర్ వెల్లడించారు. కరెన్సీ పతనాన్ని అడ్డుకట్ట వేయడానికి రిజర్వు బ్యాంక్ రంగంలోకి దిగడంతో చివర్లో కోలుకున్నది. 95.52 వద్ద ప్రారంభమైన డాలర్, రూపాయి ఎక్స్చేంజ్ రేటు ఇంట్రాడేలో 95.80 కనిష్ఠ స్థాయిని తాకింది.వరకు నిన్నటి ముగింపుతో పోలిస్తే 2 పైసలు పెరిగి 95.66 వద్ద ముగిసింది. మంగళవారం కరెన్సీ విలువ 40 పైసలు కోల్పోయి చారిత్రక కనిష్ఠ స్థాయి 95.68కి పడిపోయిన విషయం తెలిసిందే. ఆసియాలోనే అత్యంత వరస్ట్ పర్ఫార్మెన్స్ మన కరెన్సీదే కావడం గమనార్హం. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు కరెన్సీ విలువ 6 శాతం పతనం చెందింది. ఆర్బీఐ జోక్యంతోపాటు దిగుమతుల భారాన్ని తగ్గించుకోవడానికి నరేంద్ర మోదీ సర్కార్ పసిడి, వెండి దిగుమతులపై సుంకాన్ని 16 శాతానికి పెంచడం రూపాయి పతనానికి పరోక్షంగా దోహదం చేసింది. సమీక్ష భవిష్యత్తులో రూపీ విలువ 95.45 నుంచి 96.15 మధ్యలో పడిపోవచ్చునని ఫారెక్స్ డీలర్ అంచనావేస్తున్నారు.

# లుక్ అవుట్.. నోటీసులివ్వండి

మొదటి తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్న వేదికను ఆయన పంచుకోవడం శోచనీయమన్నారు. కుటుంబ సభ్యులపై ఆ స్థాయి ఆరోపణలు వచ్చినప్పుడు ఆయన ఆ సమావేశానికి వెళ్లాల్సింది కాదన్నారు. దీనివల్ల పెద్దవాళ్ల పిల్లలు ఏ తప్పు చేసినా చూడనట్లు వ్యవహరిస్తారనే భావన ప్రజల్లోకి వెళ్లిందన్నారు.



**దేశం దాటించడం బీజేపీ నైజం**
ఏ ఆరోపణలు వచ్చినా సరే తొలుత నిందితులను దేశం దాటించడం బీజేపీకి అలవాటుగా మారిందన్నారు. అందుకే బండి సంజయ్ కుమారుడు దేశం దాటి వెళ్లకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేయాలని మరోసారి చెప్పారు. అప్పుడు మాత్రమే విచారణ పారదర్శకంగా జరుగుతుందని విశ్వాసం ప్రజలకు వస్తుందన్నారు.

**బీఆర్ఎస్ వల్లే ఫోటోలు బయటకు..**
కొన్ని పార్టీల వాళ్లు ఒక ట్వీట్ వేసి సమస్యను పరిష్కరించినట్లు చెబుతున్నారని అన్నారు. తాను ఎందుకు స్పందించడం లేదంటూ నానా హంగామా చేస్తున్నారని, ఒక ఆడపిల్ల అంశం వచ్చినప్పుడు చాలా సంయమనంగా వ్యవహరించాలన్నారు. అందులోనూ అమ్మాయి మైనర్ అయినప్పుడు ఇంకా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ సమాజం మగపిల్లలను క్షమిస్తుందని, కానీ ఆడపిల్లలను క్షమించదన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా అత్యుత్సాహం కారణంగా బాధితురాలి ఫోటోలు బయటకు వచ్చాయన్నారు. దీని కారణంగా ఆ అమ్మాయి జీవితం నష్టపోయే ప్రమాదం ఉందని, పోస్ట్ చేసిన ఖాతాలను గుర్తించి వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాము ఎప్పుడూ ఆడపిల్లలకు అండగా ఉంటామన్నారు.

## అనంతసాయి సామ్రాట్ పిక్చర్స్ ప్రొడక్షన్ నెం.1 చిత్ర పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహణ



**శేరిలింగపల్లి మే 13 ( మహాప్రభ )**
కొత్త ఆరంభానికి శ్రీకారం చుడుతూ నిర్మాత పి.ఎస్. వరప్రసాదరావు నిర్మాణ సారథ్యంలో, అనంతసాయి సామ్రాట్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ప్రొడక్షన్ నెం.1 చిత్ర పూజా కార్యక్రమం హైదరాబాద్‌లోని కొండాపూర్ బ్యానర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడింది.
ఈ చిత్రానికి యువ నటుడు శ్రీనివాస్ రాజు (సామ్రాట్) కథ, మాటలు అందిస్తూ దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రముఖ ఛాయాగ్రాహకుడు నాగార్జున సినిమాటోగ్రఫీ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈ చిత్రంలో బాల నటుడు హాసన్ కృష్ణ కథానాయకుడిగా నటిస్తుండగా, బాల నటీమణులు కుమారి శ్రీలాస్య మరియు వైష్ణవి సింగ్ కథానాయికలుగా కనిపించనున్నారు. అలాగే చిత్ర తారాగణంలో భరత్, అమ్మ రమేష్, శ్రీనివాస్ నాయుడు, రాజశేఖర్ రెడ్డి (రుద్ర ఐపీస్ ఫేమ్), రాజశ్రీ రెడ్డి, మమతా హారిక, మహాలక్ష్మి, లక్ష్మీకళ్యాణి, శ్రీనివాస్ వర్మ, శంకర్రావు యడ్లపాటి, కామేష్ గౌడ్, ఏడుకొండలు, దశరథ్, కనకయ్య, ఎన్.వి.ఎస్. కామేశ్వరరావు, ఊర్వశి పటేల్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పూజా కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు, సినీ ప్రముఖులు, ఆహ్వానితులు పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. త్వరలోనే ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

## ఎండల నుండి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్




**దేవరకొండ మే 13( మహాప్రభ )**
రాష్ట్రంలో ఎండలు రోజు రోజుకు తీవ్రంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి అని శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ అన్నారు

**తగు జాగ్రత్తలు తీసుకోండి --- ఆరోగ్యంగా ఉండండి.**

మధ్యాహ్నం వేళల్లో అవసరం లేకుండా బయటకు వెళ్లకండి అని ఆయన తెలిపారు. తరచుగా తాగునీరు, మజ్జిగ, ORS వంటి ద్రవాలు తీసుకోండి.
తేలికపాటి తెలుపు రంగు కాటన్ దుస్తులు ధరించండి. అని ఆయన అన్నారు
చిన్నారులు ఎండలో బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోండి.
వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి తీసుకోవాలని తెలియజేశారు
తాజా పండ్లు, పోషకాహారం తీసుకోవాలి.
తల కప్పుకోండి, కళ్లజోడు ఉపయోగించండి.
ఎండ నుండి రక్షణ తీసుకోండి అని తెలిపారు.
అనారోగ్యంగా అనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించండి వైద్యం చేయించుకోవాలని ఆయన సూచించారు.
తగినంత నీరు త్రాగండి --- ఆరోగ్యాన్ని కాపాడుకోండి అని నియోజకవర్గంలోని ప్రజలందరూ ఎండ వేడిమిలో అప్రమత్తంగా ఉండాలని తెలియపరిచారు

## శభాష్‌పల్లి శివారులో ట్రాక్టర్ డ్రైవర్ దారుణ హత్య



**శివంపేట,మే 13(మహాప్రభ):**
అన్వర్ అనే ట్రాక్టర్ డ్రైవర్‌ను దుండగులు దారుణంగా హత్య చేసిన ఘటన శివ్వంపేట మండలం శభాష్‌పల్లి గ్రామ శివారులో కలకలం రేపింది. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఘట్కేసర్ మండలం అంకుషాపూర్ గ్రామానికి చెందిన అన్వర్ (50) ఆర్మూర్ జిల్లా బాల్కొండ నుంచి ట్రాక్టర్ తీసుకొస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. శభాష్‌పల్లి గ్రామ శివారులోని పోతారం రోడ్డుపై అన్వర్‌ను హత్య చేసి రోడ్డు పక్కన పడేసిన దుండగులు ట్రాక్టర్‌ను ఎత్తుకెళ్లినట్లు సమాచారం. ఘటన విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటన స్థలానికి చేరుకున్న వెంకటరాజు గౌడ్ అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. హత్యకు పాల్పడిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని సీఐ వెంకటరాజు గౌడ్ తెలిపారు.
ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర ఆందోళన నెలకొంది.

## ఇబ్రహింపట్నం లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనం ప్రారంభం



**రంగారెడ్డి, మే 13(మహాప్రభ):**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాన్ని ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....విద్య ద్వారానే జీవితాల్లో వెలుగులు నిడుతాయని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ అనంతరెడ్డి, తోపాటు అధికారు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి కరాటే కలర్ బెల్ట్ ఎగ్జామ్

**మెదక్ జిల్లా -13మే (మహాప్రభ ).**
మెదక్ పట్టణంలోని గుల్షన్ క్లబ్ లో రెంజుకి షాటోకన్ స్పోర్ట్స్ కరాటే అఫ్ ఇండియా ఆధ్వర్యంలో మెదక్ జిల్లాస్థాయి కరాటే కలర్ బెల్ట్ ఎగ్జామ్ ను నిర్వహించినట్లు కరాటే మాస్టర్ దినాకర్ తెలిపారు, వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ బెల్ట్ ఎగ్జామ్ కు చీఫ్ ఎగ్జామినర్ గా రెంజుకి షోటోకన్ స్పోర్ట్స్ కరాటే అఫ్ ఇండియా వ్యస్థాపక అధ్యక్షులు ,కరాటే సీనియర్ మాస్టర్ నగేష్ మాస్టర్ , ఈ బెల్ట్ ఎగ్జామ్ కు పరిశీలనకు గా రాకేష్ వ్యవహరించారని తెలిపారు ఈ కరాటే బెల్ట్ ఎగ్జామ్ లో సుమారు 100 మంది విద్యార్థులు వివిధ మండలాల నుండి వచ్చినట్లు తెలిపారుఈ బెల్ట్ ఎగ్జామ్ లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పసుపు బెల్ట్ విభాగంలో సన్నీ, భువన్ రాజ్,సుప్రీత్, సుహార్షిత్, నవదీప్, అక్షర,రితక్ రాజ్, వర్షిత్ రాజ్, రూత్విక్,రిషిక్.



ఆరంజ్ బెల్ట్ వీభాగం లో : అధ్య, దీక్షిత
గ్రీన్ బెల్ట్ విభాగంలో:హిరణ్మయి రానవీర్ సింగ్, త్రీజల్ సింగ్,
పర్పుల్ బెల్ట్ విభాగంలో: సుష్మ శ్రీ, చైతన్య శ్రీ, భీమ్ రావ్, సహస్ర, విమోచన
బ్రౌన్ 4బెల్ట్ వీభాగం లో :అభినందన్, హనీ ప్రిన్స్, మహిపాల్, బాల్య.
బ్రౌన్ 1బెల్ట్ వీభాగం లో విలసిని,మహాస్వి, మెగావార్షిక, రతన్ రబ్బు
బ్రౌన్ బెల్ట్ వీభాగంలో :ఈశ్వర్ చంద్ర
ఉత్తీర్ సాధించినట్లు తెలిపారు, ఈ బెల్ట్ ఎగ్జామ్ లో ఉత్తీర్ణ సాధించిన విద్యార్థులకు కరాటే మాస్టర్ నగేష్ మాస్టర్ బెల్ట్స్ ప్రాధాన్యం చేశారు, వారు మాట్లాడు తూ నేటి సమాజం లో కరాటే నేర్చుకోవడం అమ్మాయిలకు ఎంతో అవసరం ఉన్నదని తెలిపారు. అదేవిధంగా కరాటే యస్ జి ఎఫ్ ఐ యూనివర్సిటీ, ఆసియ, ఓలంపిక్ లో కూడా కరాటే ఉన్నదని వారు గుర్తు చేశారు,కరాటే నేర్చుకోవడం వలన విద్యార్థులు శారీరకంగా మానసికంగా దృఢంగా తయారవుతారని వారు తెలిపారు,ఈ కార్యక్రమం లో,వైష్ణవి, గణేష్, అఖిల్, తణ్మయి, విహాన్, అంకిత్ తదితరులు పాల్గోన్నారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటం

- ఆలస్యం లేకుండా నీట్ పరీక్ష నిర్వహించాలి
-బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ



**దేవరకొండ మే 13 ( మహాప్రభ )**
దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే నీట్ (NEET) పరీక్ష పేపర్ లీక్ ఘటన అత్యంత దురదృష్టకరం అని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ......నీట్ ప్రశ్నాపత్రం లీకై ఏకంగా పరీక్షనే రద్దు చేయాల్సిన దుస్థితి రావడం కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటు అని ఆయన అన్నారు.పగలూ రాత్రి కష్టపడి చదివిన ఎంతోమంది విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడింది అని ఆయన అన్నారు.పకడ్బందీగా పరీక్షలు నిర్వహించడం చేతకాని ఎన్డీఏ ప్రభుత్వ వైఫల్యం వల్లే మరోసారి పేపర్ లీకైంది అని ఆయన తెలిపారు.2024 లోనూ నీట్ ప్రశ్నాపత్రం లీకైన ఉదంతం నుంచి గుణపాఠం నేర్చుకోకపోవడం వల్లే మళ్లీ ఈ ఘటన పునరావృతమైంది అని ఆయన గుర్తు చేశారు.జాతీయ అర్హత పరీక్ష నిర్వహణలో వరుసగా వెలుగుచూస్తున్న ఈ అసమర్థత విద్యార్థుల పట్ల శాపంగా మారింది అని ఆయన తెలిపారు.దేశవ్యాప్తంగా ఈ ఏడాది నీట్ పరీక్ష రాసిన దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కేంద్ర సర్కారు తీవ్ర మానసిక క్షోభకు గురిచేసింది అని ఆయన అన్నారు.ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారాన్ని అత్యంత సీరియస్ గా తీసుకుని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించాలి ఆయన కేంద్ర ప్రభుత్వానికి కోరారు.అలాగే సాధ్యమైనంత త్వరగా మళ్లీ నీట్ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి అని కోరారు.నీట్ పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పాలి అని అన్నారు.

## ఐకెపి సెంటర్లలో ఎక్కడి వడ్లు అక్కడే...

-జరగబోయే ధర్నాలో రైతులందరూ పాల్గొనాలి



**తూప్రాన్ మే 13 (మహాప్రభ)**
మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని పలు ఐకెపి సెంటర్ లలో ఉన్న రైతులందరినీ వేధిస్తున్న ఐకెపి సెంటర్లు. తూప్రాన్ మండలం వట్టూర్ లో ఐకిపి సెంటర్ ప్రారంభమై 20 రోజులు గడుస్తున్న ఏ ఒక్కరి వద్ద ధాన్యం కొనుగోలు చేయడం లేదు ఒక్క లారీ అయినా రావడం లేదు, ప్రభుత్వం ఇచ్చే బస్తాలు లేవు అని గ్రామస్తులు వారి బాధను వెల్లడించారు. కొబ్బరికాయలు కొట్టి పూజ చేసి ఐకెపి సెంటర్లు ప్రారంభించారు, కానీ నేటికీ 20 రోజులు గడుస్తున్న వడ్లు కొనుగోలు చేయడం లేదు, రైతులు అధికారులను వడ్లు కాంట పెట్టమని అడిగితే మా చేతిలో ఏమీ లేదు పైఅధికారులు ఏ విధంగా చెబితే ఆ విధంగానే చేస్తామని తలతిక్క బదులు ఇస్తున్నారు. ఇది ఇంతే ఎవరికీ చెప్పుకుంటారో చెప్పుకోండి! అని సమాధానం ఇస్తున్న ఐకెపి సెంటర్ అధికారులు. పరిస్థితులు గమనిస్తే అకాల వర్షాలు కురిసి దాన్యం కొట్టుకు పోతుందని భయాందోళన లో రైతులు బిక్కు బిక్కుమంటున్నారు. ఆరుగాలం కష్టపడి చేతికి వచ్చిన పంటను వర్షార్పణం చేసుకునేందుకు ఏ రైతు సిద్ధంగా లేమన్నారు. ఆర్డిఓ మరియు ఎమ్మార్వో కార్యాలయాల ముందు రైతులందరూ ఏకమై ధర్నాకు దిగాలని రైతులకు జరుగుతున్న అన్యాయం పై అధికారులను నిలదీయాలని పిలుపునిచ్చారు.

## పథకాల అమలుకు దోహదం

-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**పాపన్నపేట, మే 13 ( మహాప్రభ**
జనగణన 2027 లో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. బుధవారం కుర్తివాడలో జనగణన ను తహాశీల్దార్ సతీష్ కుమార్ తో కలిసి ఆమె పరిశీలించారు.
ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ .. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా ప్రకారం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు,ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలన్నారు. సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని,గృహ జాబితా కార్యక్రమం భవిష్యత్తు ప్రణాళికలు,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కుర్తివాడలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. డి.ఎస్ఓ. డిఎం.సివిఎస్ఓ, గ్రామ సర్పంచ్ చెట్టుకింది శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల పరిరక్షణే మన లక్ష్యం

- దేవరకొండ సర్పంచుల ఫోరం అధ్యక్షులు కొర్ర రామ్ సింగ్ నాయక్.



**దేవరకొండ ( డివిజన్) 13మే మహాప్రభ**
స్థానిక మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) దేవరకొండలో బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా దేవరకొండ డివిజన్ పరిధిలోని సర్పంచుల ఫోరం వర్క్ షాప్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భాగంగా వారు ప్రభుత్వ విద్యాసంస్థల పరిరక్షణకు మనమంతా కృషి చేయాలని గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని కాబట్టి గ్రామంలోని ప్రభుత్వ విద్యాసంస్థలను పరిరక్షించాలని దానికి సర్పంచులు గ్రామంలో గ్రామ సభల ద్వారా వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలలో అవగాహన కల్పించి ప్రభుత్వ బడులలో విద్యార్థులు చేరే విధంగా అందరూ కృషి చేయాలని సర్పంచుల ఫోరం దేవరకొండ డివిజన్ అధ్యక్షులు కొర్ర రామ్ సింగ్ నాయక్ (మైనంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్) పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల ఎన్రోల్మెంట్ బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా దేవరకొండ డివిజన్ లోని ఆరు మండలాల సర్పంచులు మా కళాశాలను సందర్శించి మా కళాశాల అడ్మిషన్ బ్రోచర్ను ఆవిష్కరించడం, ప్రభుత్వ విద్యాసంస్థలను పరిరక్షించాలని తీర్మానం చేయడం ఎంతో ఆనందకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ సర్పంచుల ఫోరం అధ్యక్షులు కొర్ర రామ్ సింగ్ నాయక్, ఎంపీడీవో డానియల్, స్పైడర్ మాన్ వివిధ మండలాల ఎంఈఓ లు, వివిధ గ్రామాల సర్పంచులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ సి.లింగమయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి.లింగారెడ్డి తదితర కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కూకట్పల్లి కాంగ్రెస్ నేత పాపారావు గారి నూతన గృహప్రవేశానికి బండి రమేష్ హాజరు



**కూకట్పల్లి, మే 13 (మహ ప్రభ)**
కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాపారావు నూతన గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గృహప్రవేశ వేడుకలో గొట్టుముక్కల వెంకటేశ్వర రావు, రంగమోహన్, ధర్మారావు, వాసు, ధారాసింగ్, పాల్గుణ రావు, చందర్ రావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే మైనం పల్లి రోహిత్ రావు.



**మెదక్ జిల్లా -13మే (మహాప్రభ ).**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎమ్మెల్యే సహకారంతో స్వచ్ఛమైన నీటిని విద్యార్థులకు త్రాగునీటి సమస్య తీర్చడానికి ఆరో ప్లాంట్( వాటర్ ప్లాంట్) ను ప్రారంభించారు.అనంతరం కళాశాలను తిరిగి ఆడిటోరియం ను అద్భుతంగా తీర్చిదిద్ది విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తానని మెదక్ శాసనసభ్యులు డాక్టర్. మైనంపల్లి రోహిత్ గ హామీ ఇచ్చారు అలాగే మెయిన్ రోడ్డు నుండి డిగ్రీ కాలేజ్ వరకు రోడ్డు ఇబ్బందిగా ఉన్నందున అతి త్వరలో రోడ్డు వేయడానికి అంగీకరిస్తున్నట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కానుగు. రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్. దొంతి నరేష్ , పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందు గుల గంగాధర్ , డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ , లెక్చరర్లు, కౌన్సిలర్లు గంట సంపత్, శశాంక్, శివరామకృష్ణ, గౌస్ ఖురేషి, మన్సూర్ అలీ, సిద్ధ రాములు, మరియు నాయకులు హఫీజ్ మోల్ సాబ్, బాల్రాజ్, ముజామిల్, బుడ్డ రాజు, బోనీ, శ్రీనివాస్ చౌదరి గతదితరులు పాల్గొన్నారు.

## రూ.35 లక్షలతో నూతన సీసీ రోడ్డు పూర్తి కాలనీవాసుల హర్షం.





**కొత్తపేట 13 మే (మహాప్రభ)**
కొత్తపేట్ డివిజన్ పరిధిలోని మారుతీ నగర్ శ్వేతా గార్డెన్స్ ఎదురుగా రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సీసీ రోడ్డు పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ సందర్భంగా కాలనీవాసుల ఆహ్వానం మేరకు కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ రోడ్డును పరిశీలించారు. రోడ్డు నిర్మాణం పూర్తవడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తూ నాయకోటి పవన్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ సీసీ రోడ్డు నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా మారిందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా వర్షాకాలంలో ఎదురయ్యే బురద, నీటి నిల్వల సమస్యలకు ఈ రోడ్డు శాశ్వత పరిష్కారంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, కాలనీ పెద్దలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే కులవృత్తికి ప్రాధాన్యం మట్టి పాత్రల తయారీలో సిలివేరు విజయ్ సేవలు.





**భువనగిరి 13 మే (మహాప్రభ)**
భువనగిరి జిల్లా తంగడపల్లి గ్రామానికి చెందిన సిలివేరు విజయ్ తండ్రి జంగయ్య ప్రభుత్వం ఉద్యోగం నిర్వహిస్తూ కూడా తన కులవృత్తి పట్ల ఉన్న అభిమానం, పర్యావరణ పరిరక్షణపై అవగాహనతో సమాజానికి మట్టి పాత్రలను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎలక్ట్రిక్ సారె సహాయంతో మట్టి పాత్రలను తయారు చేస్తూ సంప్రదాయ వృత్తిని ఆధునిక విధానాలతో కొనసాగించడం విశేషమని పలువురు కొనియాడారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ హితమైన మట్టి పాత్రలను ప్రజలకు అందించడం ద్వారా సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సిలివేరు విజయ్ ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, వారి సేవలు మరెందరికో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. టీ ఆర్ కె ఎస్ తరుపున పెద్దలు టెక్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం, డాక్టర్ కంభంపాటి సత్యనారాయణ రాష్ట్ర అధ్యక్షులు, విద్యార్థి విభాగం, సిలివేరు వెంకటేష్ బిగ్ బజార్ మేనేజర్, సిలివేరు కృష్ణ తదితరులు కలిసి అభినందించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్.దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్



**దేవరకొండ మే 13 ( మహాప్రభ )**
దేవరకొండ పట్టణంలో 14 వ వార్డు కు చెందిన పద్మ కూతురు శృతి - కోటేష్ లా వివాహం దేవరకొండ పట్టణం లోని పి.పి. ఆర్ కన్వెన్షన్ లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన బి ఆర్ ఎస్. దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ ఈ కార్యక్రమంలో 1 వార్డు కౌన్సిలర్ అంజయ్య .వడ్డెర సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య.నాయకులు బాబా.రమేష్. తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# పెద్దమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి.

-చందాపూర్‌లో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.




**మెదక్ జిల్లా -13మే (మహాప్రభ )**
మెదక్ జిల్లా శంకరంపేట మండలంలోని చందాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో బుధవారం మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెద్దమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు ఆనందంగా ఉండాలని కోరుకున్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులను అభినందించారు. అమ్మవారి కృపతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని కోరుతూ, దేవాలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం చందంపేట్ బిఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ సురేష్ వివాహము మండల కేంద్రంలోని రాధాస్వామి ఫంక్షన్ హాల్ లో అదే అదేవిధంగా శంకరంపేట్ బిఆర్ఎస్ కార్యకర్త హేమ.నర్సింలు కుమార్తె వివాహం కూడా మండల కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శంకరంపేట ఆర్ మండల పార్టీ అధ్యక్షులు పట్లోరి.రాజు,పట్టణ అధ్యక్షులు హేమ చంద్రం, సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, కుమార్ గౌడ్, సర్పంచ్ లు చెన్నైగౌని కృష్ణా గౌడ్, ఇమ్మడి నరేష్, నాయిని ప్రవీణ్, మాజీ సర్పంచ్ సుంకరి కుమార్ గౌడ్, మంచాల లక్ష్మణ్, తాటికొండ శ్రీలత స్వామిరాజ్, పడాల రమాదేవి శ్రీనివాస్, మండల నాయకులు యేమ చంద్రం, యేమ శ్రీనివాస్, యెల్లోళ్ల నవీన్, ఆలూరి రవి, , శేరి స్వామి, , చెన్నైగౌని శేఖర్ గౌడ్, ముదిరాజ్ సంఘం నాయకులు శివరాములు, సత్యనారాయణ, పోతారాజు రాజు, పోతారాజు శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోతరాజుపల్లి కమాన్‌కు నూతన శోభ

-ఆరు దశాబ్దాల చరిత్రను స్మరింపజేస్తూ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి స్వాగత తోరణం ఘనంగా ప్రారంభోత్సవం





**తూప్రాన్, మే , 13,(మహాప్రభ)**
తూప్రాన్ మండల పరిధిలోని పోతరాజుపల్లి చౌరస్తా వద్ద ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబించేలా నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి స్వాగత తోరణం (కమాన్) బుధవారం వైభవంగా ప్రారంభమైంది. వైశాఖ బహుళ ఏకాదశి బుధవారం ఉదయం 5:15 గంటలకు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి స్వాగత తోరణ ప్రారంభోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హారతులు, స్వామివారి నామస్మరణతో ఆ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. పోతరాజుపల్లి కమాన్ నేడు కేవలం ఒక స్వాగత తోరణం మాత్రమే కాకుండా, భక్తి, విశ్వాసం, కుటుంబ సేవా సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. దాదాపు ఆరు దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ కమాన్ భక్తుల విశ్వాసానికి, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచింది.

1967 సంవత్సరంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన సామాజిక సేవకులు స్వర్గీయ శ్రీ మన్నె రాజేశ్వర్ రావు -- సరోజినీదేవి దంపతులు తమ వంతు సేవాభావంతో నాచారంగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి అనుబంధంగా పోతరాజుపల్లి చౌరస్తా వద్ద ఈ కమాన్‌ను నిర్మించారు. జాతీయ రహదారిపై ప్రయాణించే వేలాది మంది భక్తులు ఈ కమాన్ వద్ద ఆగి స్వామివారిని దర్శించుకుని తమ కోరికలు కోరుకునే వారు. కోరికలు నెరవేరిన అనంతరం నాచారంగుట్టకు చేరుకొని మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా మారింది.

కాలక్రమేణా జాతీయ రహదారి విస్తరణ పనులతో కమాన్ మధ్యలోకి రావడం, భారీ వాహనాలు ఢీకొనడం వల్ల పాత కమాన్‌కు బీటలు రావడంతో స్థానిక ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు ఈ విషయాన్ని మన్నె కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన శ్రీ మన్నె రాజేశ్వర్ అశోక్ కుమార్ గారు నూతన కమాన్ నిర్మాణానికి హామీ ఇచ్చి, అత్యంత శోభాయమానంగా ఆధునిక హంగులతో కమాన్‌ను పునర్నిర్మించారు. స్వర్గీయ శ్రీ మన్నె రాజేశ్వర్ రావు -- సరోజినీదేవి గార్ల జ్ఞాపకార్థంగా వారి కుమారుడు శ్రీ మన్నె రాజేశ్వర్ అశోక్ కుమార్ గారు, ధర్మపత్ని శ్రీమతి పుష్పలత గారితో కలిసి ఈ మహత్తర నిర్మాణాన్ని చేపట్టారు. వారి కుటుంబ సభ్యులు శ్రీమతి ಌ శ్రీ మన్నె అశోక్ విశాల్, శ్రీమతి ಌ శ్రీ మన్నె అశోక్ క్రాంతి, ఆశకి సుమన్, శ్రీయన్ రాజ్, అనన్య మన్నె, అనైరా మన్నె తదితరులు ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమానికి దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్, మాజీ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, మెదక్ ఎంపీ,మాధవనేని రఘునందన్ రావు, ఎమ్మెల్సీలు శ్రీ అంజిరెడ్డి, శ్రీ వంటేరు యాదవ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ శ్రీమతి చిలుమల సుహాసిని రెడ్డి, మున్సిపల్ చైర్మన్ శ్రీ బొంది రజని రవీందర్ గౌడ్ , ఆలయ కమిటీ చైర్మన్ శ్రీమతి యంజాల కీర్తన విఠల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ శ్రీమతి బొడ్డు రాధాకుమారి శ్రీనివాస్, ఐలేని యాదవ్, నాచారంగుట్ట దేవస్థాన చైర్మన్ శ్రీ లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త, ఈవో శ్రీ బెల్లంకొండ రంగాచారి, మాజీ ఎఫ్డీసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, జెడ్పీటీసీ సత్యనారాయణ గౌడ్, ఇస్లాంపూర్ నరేందర్ రెడ్డి, మహమ్మద్ హమ్మద్, బుక్క విజయ్ కుమార్, పోతరాజు ధనరాజ్, కుమ్మరి చెలిమెల రాములు, కుమ్మరి రఘుపతి, కుమ్మరి రమేష్, చాకరిమెట్ల చైర్మన్, చాకరిమెట్ల ఆలయ ప్రధాన పూజారి ఆంజనేయ శర్మ, కొడకంచి శ్రీనివాస్ గౌడ్, బోల్లేబోయిన మల్లేష్ యాదవ్ , అంజయ్య యాదవ్, పఠాన్ చేరు ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ లయన్ డాక్టర్ జానకిరామ్ సిఆర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు యాదగిరి, దామోదర్ రెడ్డి, నారాయణ చారి, బాలమల్లేష్, శంభయ్యా, మాజీ కౌన్సిలర్ దుర్గా రెడ్డి, తదితర ప్రముఖులను ఆహ్వానించి ప్రారంభించారు. అలాగే శ్రీ జగ్గయ్యగారి శేఖర్ గుప్త, శ్రీమతి దేశపతి ఉషశ్రీ, కిష్టయ్య, శ్రీమతి కర్రె వర్చు, శ్రీ కొత్తపల్లి శ్రీనివాస్, శ్రీ జగ్గన్నగారి సురేందర్ రెడ్డి, శ్రీ కె.ఎస్.కురుముల రావు, శ్రీ రుద్ర శ్రీహరి, శ్రీనాయకం శ్రీనివాస్, కూచవరం సంతోష్ కుమార్, శ్రీ బెల్లంకొండ జగన్నాథాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి పోలీసుల చొరవతో పోయిన
# ఫోన్లు తిరిగి బాధితుల చెంతకు




**కామారెడ్డి, మే 13(మహాప్రభ)**
జిల్లాలో పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందించడంలో కామారెడ్డి పోలీసులు విశేష ఫలితాలు సాధిస్తున్నారని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ తెలిపారు. CEIR పోర్టల్ సహాయంతో ప్రతి నెలా 100కు పైగా మొబైల్ ఫోన్లను రికవరీ చేస్తున్నామని వెల్లడించారు. ఈ ఏడాది ఇప్పటివరకు రూ.79 లక్షల విలువైన 499 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించినట్లు ఎస్పీ తెలిపారు. గత 30 రోజుల్లోనే ప్రత్యేక బృందం రూ.19 లక్షల విలువైన 115 మొబైల్ ఫోన్లను రికవరీ చేసిందన్నారు. CEIR పోర్టల్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో మొత్తం 4,780 మొబైల్ ఫోన్లను గుర్తించి, సుమారు రూ.7.64 కోట్ల విలువైన ఫోన్లను బాధితులకు తిరిగి అందజేసినట్లు చెప్పారు. ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్ కేవలం కమ్యూనికేషన్ సాధనం మాత్రమే కాకుండా బ్యాంకింగ్ వివరాలు, వ్యక్తిగత ఫోటోలు, కీలక సమాచారం నిల్వ ఉండే పరికరంగా మారిందని ఎస్పీ పేర్కొన్నారు. ఫోన్ పోగొట్టుకోవడం వల్ల వ్యక్తిగత భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉన్నందున జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందన్నారు. ఇన్‌స్పెక్టర్ సంపత్ పర్యవేక్షణలో RSI బాలరాజు, ఐదుగురు కానిస్టేబుళ్లతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్లను గుర్తిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాదిలోనే రూ.3 కోట్ల విలువైన 1,834 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించామని వెల్లడించారు. మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, సిమ్ కార్డును బ్లాక్ చేయడంతో పాటు www.ceir.gov.in వెబ్‌సైట్‌లో IMEI నంబర్‌ను బ్లాక్ చేయాలని ఎస్పీ సూచించారు. గుర్తుతెలియని లింకులు, కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రికవరీ అయిన మొబైల్ ఫోన్లను పొందేందుకు బాధితులు అవసరమైన ధృవపత్రాలతో జిల్లా పోలీస్ కార్యాలయంలో RSI బాలరాజు (ఫోన్: 8712686114)ను సంప్రదించాలని ఎస్పీ తెలిపారు.

# బక్రీద్ పండుగ సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై డీజీపీ సి.వి. ఆనంద్, ఐపీఎస్ వీడియో కాన్ఫరెన్స్

**-జిల్లా పోలీస్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి హాజరైన యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ మరియు పోలీసు అధికారులు**
**-చెక్‌పోస్టులు, సోషల్ మీడియాలో ప్రత్యేక నిఘా**








**కామారెడ్డి మే 13 (మహాప్రభ)**
శాంతిభద్రతలపై జిల్లా అధికారులకు కీలక ఆదేశాలు బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనరేట్ల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాల పరిధిలో తీసుకోవాల్సిన చర్యల గురించి సలహాలు, సూచనలు అందించారు. రాష్ట్ర సరిహద్దులు, చెక్‌పోస్టులు, ప్రధాన రహదారులు, పశువుల రవాణా ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో 24 గంటల నిఘా కొనసాగించాలని సూచించారు. పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. అలాగే గోవుల రవాణా పేరుతో కొందరు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం, అల్లర్లు సృష్టించే ప్రయత్నాలు చేసినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. చట్టాన్ని అమలు చేసే బాధ్యత పూర్తిగా పోలీసు శాఖదేనని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు ప్రచారాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అలాంటి పోస్టులు పెట్టే వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీజీపీ ఆదేశించారు. ప్రార్థనా స్థలాలు, మార్కెట్లు, రద్దీ ప్రాంతాల్లో అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమానికి జిల్లా పోలీసు కార్యాలయం నుండి అదనపు కలెక్టర్ విక్టర్, వెటర్నరీ అధికారులు, రెవెన్యూ అధికారులతో హాజరైన జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ జిల్లాలో తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. గోవుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, జిల్లా వ్యాప్తంగా అంతర్‌జిల్లా సరిహద్దుల్లో 6 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటల తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లా అంతటా మత పెద్దలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పండుగను ప్రశాంత వాతావరణంలో అందరూ కలిసి మెలిసి జరుపుకునేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఎస్పీ రెవెన్యూ అధికారులు, వెటర్నరీ అధికారులతో కలిసి జిల్లా పోలీసు అధికారులతో సమావేశమై అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రార్థనా స్థలాలు, ప్రధాన కూడళ్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.
గోవుల అక్రమ రవాణాపై కఠిన నిఘా కొనసాగించాలని, చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని తెలిపారు. ప్రజలు పరస్పర సామరస్యంతో, సోదరభావంతో బక్రీద్ పండుగను జరుపుకోవాలని ఎస్పీ కోరారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ కె. నర్సింహారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, వెటర్నరీ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# స్టేషన్ పరిధిలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలి

**-డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం నిర్వహించాలి.**
**-తూప్రాన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ. డి . వి. శ్రీనివాస రావు ఐపీఎస్.**




**మెదక్ జిల్లా -13మే (మహాప్రభ,)**
బుధవారం మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తూప్రాన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి, పలు అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను పరిశీలించిన ఎస్పీ, వాటి దర్యాప్తు పురోగతిపై ఎస్ఐ గంగారాజును అడిగి తెలుసుకున్నారు. కేసుల విచారణను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాల నివారణలో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును కూడా పరిశీలించి, ముఖ్య కూడళ్లు మరియు ప్రమాదకర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడిన ఎస్పీ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారం పోలీసు సిబ్బందికి సంబంధించిన సమస్యలను నేరుగా తనను కలిసి వివరించవచ్చని సూచించారు. సిబ్బంది నిర్వహిస్తున్న విధుల వివరాలను అడిగి తెలుసుకుని, విధి నిర్వహణలో క్రమశిక్షణతో పాటు ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల ఫిర్యాదులను సత్వరమే స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ వెంట తూప్రాన్ డియస్పి నరేందర్ గౌడ్, తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి. సిబ్బంది ఉన్నారు.

## పలు శుభకార్యాలలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి



**దేవరకొండ ( డివిజన్) 13మే మహాప్రభ:**
చింతపల్లి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన అనంతుల జంగయ్య గాయిత్రి గార్ల వివాహ వేడుకలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. చింతపల్లి మండలం సాయిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన గాద్దుల వెంకటేష్ యాదవ్ – లక్ష్మి గార్ల వివాహ వేడుకలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. చింతపల్లి మండలం కుర్మేడు గ్రామంలో ఇంద్రకంటి మహేష్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. చింతపల్లి మండలం నసర్లపల్లి గ్రామానికి చెందిన తిరుగుళ్ల కిరణ్ కుమార్ – యమున గార్ల వివాహ వేడుకలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు రవిందర్ గౌడ్,పున్రెడ్డి సుమతి రెడ్డి బిఆర్ఎస్ పార్టీ బాదేపల్లి నీరంజన్,సిమర్ల శ్రీను యాదవ్,నక్కనమోని పరమేష్, నక్కనమోని శ్రీను,గడ్డం శేఖర్,అనంతుల శ్రీకాంత్,వరికుప్పల శివ,నక్కనమోని నాగరాజు,పుల్లముల రమేష్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దత్తాత్రేయ స్వామి ఆలయ మొదటి వార్షికోత్సవం మహోత్సవం

**-ఆలయ నిర్వాహా కమిటీ సభ్యులు**






**గాంధారి, మే 13(మహాప్రభ)**
దత్తాత్రేయ స్వామి ఆలయంలో నిర్వహించిన మొదటి వార్షికోత్సవ మహోత్సవం శ్రీ గురుదేవ దత్త కృపాకటాక్షాలతో అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా పూర్తి అయి దైవ అనుగ్రహము ప్రజలకు ఎప్పుడూ ఉండాలని భక్తులు కోరుచున్నారు. ఈ దైవిక కార్యక్రమానికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సేవాసహకారాలు అందించిన గాంధారి మండల కేంద్రంలో ప్రతి భక్తునికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. మీ అందరి భక్తి, సేవాభావం, గురుస్మరణ ఆశీస్సులతో ఈ ఉత్సవంఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతూ ఎంతో ఘనంగా జరిగింది. శ్రీ దత్తాత్రేయ స్వామివారి అనుగ్రహం ఎల్లప్పుడూ మీ కుటుంబాలపై నిలిచి,ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. గురుదేవుని సేవలో మీ ఆదరణ,సహకారం కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు.

## తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టీ ఆర్ కే ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దంపతులకు పెళ్లి రోజు శుభాకాంక్షలు.



**మల్కాజ్గిరి 13 మే (మహాప్రభ)**
వివాహ వార్షికోత్సవాన్ని ఆనందంగా జరుపుకుంటున్న తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టీ ఆర్ కె ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్ , విజయలక్ష్మి దంపతులకు తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టీ ఆర్ కే ఎస్ రాష్ట్ర కమిటీ తరఫున, 33 జిల్లాల కార్యవర్గ సభ్యుల తరఫున, అలాగే సమస్త కుమ్మర కులస్థుల తరఫున హృదయపూర్వక పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ నాయకులు మాట్లాడుతూ, దయానంద్ విజయలక్ష్మి దంపతులు సమాజ సేవలో ఆదర్శంగా నిలుస్తూ, కుమ్మర సంఘ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యసంపదలతో నిండిపోవాలని, భగవంతుని ఆశీస్సులతో మరెన్నో సంవత్సరాలు ఆనందంగా కలిసి జీవించాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టీ ఆర్ కే ఎస్ రాష్ట్ర కమిటీ 33 జిల్లాల కార్యవర్గ సభ్యులు సమస్త కుమ్మర కులస్థులు

## విద్యా ప్రమాణాల పెంపుదలకు ..



**పాపన్నపేట, మే13( మహా ప్రభ )**
కస్తూర్బా గాంధీ పాఠశాలలో రూ.42 లక్షలతో అదనపు గదులువిద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన పాపన్న పేట కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సమగ్ర శిక్ష అభియాన్ నిధులతో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రూ.42 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదులు,డార్మిటరీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు .ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థినులకు విశాలమైన తరగతి గదులు,వసతి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. హాస్టల్‌లో ఉండే బాలికలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అదనపు మౌలిక వసతులు అవసరమయ్యాయని,ఈ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ సతీష్ కుమార్,పీఆర్ ఏఈ శ్రీకాంత్,పాఠశాల ఎస్ఓ బాల లక్ష్మి,మమత,పాపన్నపేట సర్పంచ్ పావని గౌడ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్,సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు వెంకటేశం,సర్పంచులు శ్రీధర్, శ్రీనివాస్,ఉపసర్పంచ్ సద్దామ్ హుసేన్,నాయకులు కిష్టయ్య, శివయ్య,అంజి,హీరాలాల్, ప్రవీణ్ గౌడ్,ప్రసాద్ గౌడ్,నాని,సుఫీ,ఖలీమ్ తదితరులు ఉన్నారు.


## తూప్రాన్‌లో నాచారం ద్వార తోరణం ప్రారంభోత్సవం



**శివంపేట, మే 13(మహాప్రభ):**
చిలుముల సుహాసిని రెడ్డి నేడు తూప్రాన్ మున్సిపాలిటీ పోతరాజుపల్లి కమాన్‌లోని శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి వారి దేవస్థానం నాచారం ద్వార తోరణం (కమాన్) ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొంది రజిని రవీందర్ గౌడ్, కొడకంచి శ్రీనివాస్ గౌడ్, కమిషనర్ గణేష్ రెడ్డి, మాజీ ఎంపిటిసి జంగం విజయ వెంకటేష్, మాజీ సర్పంచ్ భానూరి నారా గౌడ్, శేఖర్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి తదితర స్థానిక నాయకులు మరియు భక్తులు పాల్గొన్నారు. ద్వార తోరణం ప్రారంభంతో ఆలయానికి మరింత శోభ చేకూరిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్యే సహకారంతో పేదల కుటుంబాలకు సొంతింటి కల సహకారం

**-తిప్పారం గ్రామంలో ఇంద్రమ్మ నూతన గృహప్రవేశం**






**గాంధారి, మే 13(మహాప్రభ)**
ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు మదన్ మోహన్, సహకారంతో గాంధారి మండలం తిప్పారం గ్రామానికి చెందిన ఎంకని గంగామణి భర్త సాయిలు, ఇందిరమ్మ నూతన గృహ నిర్మాణాన్ని గ్రామ సర్పంచ్ శ్రీమతి సోలంకి ప్రమోద మాధవరావు, చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి నూతన గృహ ప్రవేశాని ప్రారంభించారు. వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ శ్రావణ్, పాలక వర్గం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మండల సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షుడు బీసా గణేష్, సొసైటీ డైరెక్టర్ సంతోష్, బెజగం సంతోష్,ఇతర గ్రామా సర్పంచ్ లు గ్రామ కార్యదర్శి అరుణ్ కుమార్, పాల్గొన్నారు.

# బిజినెస్

## నష్టాల నుంచి కోలుకున్న సూచీలు.. ఫ్లాట్‌గా ముగిసిన సెన్సెక్స్..




వరుసగా రెండు రోజులు భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు బుధవారం స్వల్ప లాభాలను ఆర్జించాయి. ఉదయం భారీ నష్టాల్లో కొనసాగినా మధ్యాహ్నం కోలుకున్నాయి. కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడం సూచీలకు కలిసి వచ్చింది. అలాగే అంతర్జాతీయంగా కాపర్ ధరలు పెరగడంతో మెటల్ స్టాక్స్ భారీగా లాభపడ్డాయి. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప లాభాలతో రోజును ముగించాయి గత సెషన్ ముగింపు (74,559)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 100 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత కిందకు వెళ్లింది. అయితే మధ్యాహ్నం తర్వాత సూచీలు కోలుకున్నాయి. ఇంట్రాడే కనిష్ఠంతో పోల్చుకుంటే సెన్సెక్స్ ఒక దశలో 1000 పాయింట్లు పైకి వచ్చింది. చివరకు సెన్సెక్స్ 49 పాయింట్ల లాభంతో 74,608 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 33 పాయింట్ల లాభంతో 23,412 వద్ద స్థిరపడింది . సెన్సెక్స్, నిఫ్టీలో సెయిల్, డిక్సన్ టెక్నాలజీస్, వొడాఫోన్ ఐడియా, వేదాంత, మనప్పురం ఫైనాన్స్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి (ఒష్ఘుతీవ ఘుతీఎవ్ అవషం). మ్యాక్స్ ఫైనాన్సియల్స్, టాటా పవర్, పేటీఎమ్, కేఫిన్ టెక్నాలజీస్, ఎయిచర్ మోటార్స్ మొదలైన షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 99 పాయింట్లు కోల్పోయింది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 460 పాయింట్లు ఆర్జించింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ (95.70)గా ఉంది

## పెట్రో బాంబ్ తప్పకపోవచ్చు..!

### భారాన్ని కేంద్రం ఎంతోకాలం మోయలేదు : ఆర్‌బిఐ గవర్నర్




**న్యూఢిల్లీ :**
దేశంలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపునకు స్పష్టమైన సంకేతాలు వస్తున్నాయి. చమురు కంపెనీలకు లక్షల కోట్ల నష్టం వస్తుందని ఇటీవల కేంద్ర చమురు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి ప్రకటన చేయగా.. తాజాగా ఆర్‌బిఐ గవర్నర్ అదే తరహాలో మాట్లాడారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరికొంత కాలం కొనసాగితే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం ఉందని భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా హెచ్చరించారు. స్విట్జర్లాండ్‌లో జరిగిన ఐఎంఎఫ్ సదస్సులో ఆయన ప్రస్తుత పరిస్థితులపై మాట్లాడారు.అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరుగుతున్నప్పటికీ ప్రస్తుతం ప్రభుత్వ రంగ చమురు సంస్థలే ఆ భారాన్ని భరిస్తున్నాయని గవర్నర్ తెలిపారు. అయితే యుద్ధం సుదీర్ఘ కాలం కొనసాగితే ఈ భారాన్ని ప్రభుత్వం ఎంతో కాలం మోయలేదన్నారు. పెరిగిన ధరలను వినియోగదారులపైకి బదలాయించక తప్పని పరిస్థితి రావచ్చన్నారు. దేశీయంగా విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడానికి పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించుకోవాలని ప్రధాని మోడీ ఇప్పటికే దేశ ప్రజలకు విజ్ఞప్తి చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

## దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పెరిగిన బంగారం ధరలు

మే 13, 2026 నాటి తాజా సమాచారం ప్రకారం, దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు ఆకాశాన్ని తాకాయి. కేంద్ర ప్రభుత్వం బంగారంపై దిగుమతి సుంకాన్ని భారీగా పెంచడంతో ఒక్కరోజే తులం బంగారంపై రికార్డు స్థాయిలో పెరుగుదల నమోదైంది.

**ధరల వివరాలు (హైదరాబాద్ / తెలంగాణ):**
కేంద్రం దిగుమతి సుంకాన్ని 6% నుండి 15%కి పెంచడం వల్ల మార్కెట్‌లో భారీ మార్పులు సంభవించాయి:
24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు): 1,67,890 (సుమారు 14,000 పెరుగుదల)
22 క్యారెట్ల బంగారం (10 గ్రాములు): 1,53,900 (సుమారు ? 12,800 పెరుగుదల)
వెండి (1 కిలో): 3,30,000



**ప్రధాన కారణాలు:**
దిగుమతి సుంకం: విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసేందుకు ప్రభుత్వం బేసిక్ కస్టమ్స్ డ్యూటీని పెంచి, దానికి 5% అగ్రికల్చర్ సెస్ కలిపింది.
ప్రధాని పిలుపు: దేశ ఆర్థిక వ్యవస్థ దృష్ట్యా ప్రజలు ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను తగ్గించాలని ప్రధానమంత్రి సూచించారు. ఈ భారీ పెరుగుదల కారణంగా సామాన్య ప్రజలు, ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్‌లో ఉన్న వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక జ్యువెలరీ షాపుల్లో మేకింగ్ ఛార్జీలు మరియు 3% GST అదనంగా ఉంటాయని మార్కెట్ నిపుణులు తెలిపారు.

# స్పోర్ట్స్

## అర్ధరాత్రి 1:30 కు హార్దిక్ ప్రాక్టీస్

ఈ ఐపీఎల్ సీజన్ ముంబై ఇండియన్స్ ఏ మాత్రం కలిసిరాలేదు. వరుస మ్యాచ్ లల్లో ఓటమి పాలైన ఈ మోస్ట్ సక్సెస్ ఫుల్ టీమ్.. ఇప్పటికే ప్లేఆఫ్స్ నుంచి అవుట్ అయింది. దానికి తోడు కెప్టెన్ హార్దిక్ పాండ్యా వివాదాల్లో చిక్కుకున్నాడు. నడుం నొప్పి, జట్టు యాజమాన్యంతో విభేదాలు, కెప్టెన్సీ విషయంలో విమర్శలు.. ఇలా ముప్పేట దాడిని ఎదుర్కొంటోన్నాడు.నడుం నొప్పితో ఐపీఎల్ లో మిగిలిన మ్యాచ్ లకు దూరం అవొచ్చనే వార్తలకు తాజాగా చెక్ పెట్టాడు హార్దిక్ పాండ్యా. తన తాజా వీడియోతో వాటన్నింటికీ ఫుల్ స్టాప్ పెట్టాడు. ధర్మశాల వేదికగా గురువారం పంజాబ్ కింగ్స్‌తో జరగనున్న మ్యాచ్‌కు ముందు.. తాను పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నాని నిరూపించుకునే ప్రయత్నం చేస్తోన్నాడు. ముంబైలో అర్ధరాత్రి 1:30 గంటలకు నెట్ సెషన్స్ లో కనిపించాడు హార్దిక్. బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. తనదైన శైలిలో భారీ షాట్లు ఆడాడు. ముంబై ఇండియన్స్ ఆడిన చివరి రెండు మ్యాచ్‌లకు హార్దిక్ పాండ్యా నడుము నొప్పి కారణంగా దూరమయ్యాడు. అతని గైర్హాజర్ కావడం పుకార్లకు తెరతీసింది. జట్టులో విభేదాలు తలెత్తాయని, అతని




పేలవమైన కెప్టెన్సీ పట్ల మేనేజ్మెంట్ కూడా ఆగ్రహంతో ఉందనే ఊహాగానాలు చెలరేగాయి. తాజా వీడియోతో ఈ విమర్శలకు తెరదించాడు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1:30 గంటల సమయంలో ముంబైలోని రిలయన్స్ కార్పొరేట్ పార్క్‌లో హార్దిక్ తీవ్రంగా సాధన చేస్తూ కనిపించారు. ఈ గ్రౌండ్ రిలయన్స్ కార్పొరేట్ పార్క్ కు చెందినది కావడం వల్ల జట్టు యాజమాన్యంతో కూడా విభేదాలు లేవనే విషయాన్ని చెప్పకనే చెప్పినట్టయింది. ఈ వీడియోలో అతను కఠోరమైన శిక్షణలో పాల్గొనడం, బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ తన నైపుణ్యాలను సానబెట్టుకోవడం చూడొచ్చు.అన్ని పుకార్లకు అడ్డుకట్ట వేశాడు అనే క్యాప్షన్‌తో ఈ వీడియో పోస్ట్ అయింది. ఈ ఐపీఎల్ సీజన్‌లో ముంబై ఇండియన్స్ నిరాశజనకంగా ఆడుతోంది. ఇప్పటికే ప్లేఆఫ్ రేసు నుంచి కూడా నిష్క్రమించింది. 11 మ్యాచ్‌ల్లో ఆరు పాయింట్లతో పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంలో కొనసాగుతోంది. హార్దిక్ సారథ్యంలో ముంబై ఇండియన్స్ పాయింట్ల పట్టికలో అట్టడుగుకు చేరడం గత మూడేళ్లలో ఇది రెండోసారి. హార్దిక్ గైర్హాజరీలో సూర్యకుమార్ యాదవ్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. గురువారం జరిగే మ్యాచ్‌కు హార్దిక్ అందుబాటుపై అనుమానాలు నెలకొనడంతో, సూర్యకుమార్ యాదవ్ మరోసారి జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం ఉంది.


## కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్‌కు 12 లక్షల ఫైన్




**అహ్మదాబాద్**
ఐపీఎల్‌లో మంగళవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ సన్‌రైజర్స్ జట్టు 82 రన్స్ తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది.అయితే ఆ మ్యాచ్‌లో హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్(ఞ్ఘ్ జబఎఎటఅం)కు జరిమానా పడింది. స్లో ఓవర్ రేటు కారణంగా అతనికి ఫైన్ విధించారు. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ అతనికి 12 లక్షల జరిమానా విధించింది. వాస్తవానికి ఈ మ్యాచ్ కేవలం 34.5 ఓవర్లలోనే ముగిసింది. అయినా కానీ కమ్మిన్స్‌కు జరిమాన విధించాల్సి వచ్చింది. ఫస్ట్ బౌలింగ్ చేసిన హైదరాబాద్.. చాలా నెమ్మదిగా బౌలింగ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ జట్టుకు ఇదే తొలి ఉల్లంఘనగా ఐపీఎల్ పేర్కొన్నది. ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం కమ్మిన్స్ ఫైన్ వేస్తున్నట్లు ఐపీఎల్ తన రిలీజ్‌లో చెప్పింది. 169 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు కేవలం 86 పరుగులకే ఆలౌటైంది. జీటీ పేస్ బౌలర్లు ఈ మ్యాచ్‌లో చెలరేగిపోయారు

## వింత షాట్‌తో అదరగొట్టిన వాషింగ్టన్ సుందర్

ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్ దూసుకుపోతోంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను 82 పరుగుల భారీ తేడాతో ఓడించి, పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. ఈ మ్యాచ్‌లో అందరి దృష్టిని ఆకర్షించింది మాత్రం వాషింగ్టన్ సుందర్ కొట్టిన ఆ అద్భుతమైన సిక్సర్. ఏకంగా గ్రౌండ్‌పై కూర్చుని మరీ కొట్టిన ఆ షాట్‌ను చూసి స్టేడియం మొత్తం ఒక్కసారిగా హోరెత్తిపోయింది. గుజరాత్ ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో ఈ వింత దృశ్యం చోటుచేసుకుంది. ఇషాన్ మలింగ వేసిన లో-ఫుల్ టాస్ బంతిని వాషింగ్టన్ సుందర్ అద్భుతంగా డీల్ చేశాడు. దాదాపు నేలపై కూర్చుని, ఆ బంతిని డీప్ మిడ్ వికెట్ మీదుగా ఫ్లాట్ సిక్సర్‌గా మలిచాడు. ఈ షాట్ చూసిన గుజరాత్ టైటాన్స్ ఆటగాళ్లంతా డగౌట్‌లో లేచి నిలబడి చప్పట్లు కొట్టారు. క్రికెట్ చరిత్రలోనే ఇది ఒక అత్యంత అరుదైన, క్రియేటివ్ షాట్ అని విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.టాస్ గెలిచిన గుజరాత్ మొదట బ్యాటింగ్ చేపట్టింది. పిచ్ బ్యాటింగ్‌కు అంత సులభంగా లేకపోయినా, సాయి



సుదర్శన్ (61) ఎంతో పరిణతితో ఆడాడు. మరోవైపు వాషింగ్టన్ సుందర్ కేవలం 33 బంతుల్లోనే 50 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. వీరిద్దరి వీరోచిత పోరాటంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. వికెట్ కష్టంగా ఉంది, అందుకే చివరి వరకు క్రీజులో ఉండాలని ప్లాన్ చేశామని మ్యాచ్ అనంతరం సుందర్ చెప్పుకొచ్చాడు.169 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆరంభం నుంచే తడబడింది. గుజరాత్ బౌలర్లు కగిసో రబాడ (3/28), జేసన్ హోల్డర్ (3/20) నిప్పులు చెరిగే బంతులతో హైదరాబాద్ బ్యాటర్లను వణికించారు. పవర్‌ప్లే ముగిసేసరికే హైదరాబాద్ 60 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత కోలుకోలేకపోయిన ఆరెంజ్ ఆర్మీ కేవలం 14.5 ఓవర్లలో 86 పరుగులకే కుప్పకూలింది.ఈ గెలుపుతో గుజరాత్ టైటాన్స్ ఈ సీజన్‌లో వరుసగా ఐదో విజయాన్ని నమోదు చేసింది. టీమ్ వర్క్, పక్కా ప్లానింగ్ తో గుజరాత్ ఇప్పుడు ఐపీఎల్ 2026లో అత్యంత బలమైన జట్టుగా కనిపిస్తోంది. రబాడ, సిరాజ్ వంటి వరల్డ్ క్లాస్ బౌలర్లు నెట్స్‌లో ఎదుర్కోవడం వల్లే తమ బ్యాటింగ్ మెరుగుపడిందని సుందర్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నాడు. హైదరాబాద్‌ను చిత్తు చేసిన గుజరాత్, ఇప్పుడు టైటిల్ రేసులో అందరికంటే ముందు వరుసలో నిలిచింది.
...

# వన్స్‌మోర్.. అల్లు అర్జున్‌తో ‘బుట్టబొమ్మ’ రొమాన్స్..!



టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ ప్రస్తుతం రాకా సినిమాతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. ఇదిలా ఉంటే మరోవైపు తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చేశాడు. ౹ూూ23గా రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త మూవీ లవర్స్‌ను ఎక్జయిటింగ్ అయ్యేలా చేస్తోంది. పొడుగు కాళ్ల సుందరి పూజా హెగ్డే ఈ చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించనుందట.టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ ప్రస్తుతం రాకా సినిమాతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. ఇదిలా ఉంటే మరోవైపు తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చేశాడు. ౹ూూ23గా రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త మూవీ లవర్స్‌ను ఎక్జయిటింగ్ అయ్యేలా చేస్తోంది. పొడుగు కాళ్ల సుందరి పూజా హెగ్డే ఈ చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించనుందట.





# సమంత ‘మా ఇంటి బంగార ’ కొత్త రిలీజ్ డేట్..

## యాంగ్రీ లుక్‌తో అదిరిపోయిన పోస్టర్!

స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘మా ఇంటి బంగారం’పై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. ఫీమేల్ సెంట్రిక్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రముఖ దర్శకురాలు నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తుండటంతో సినీ అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. మొదట ఈ సినిమాను మే 15న విడుదల చేయాలని మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ మూవీ రిలీజ్ వాయిదా పడింది. దీంతో అభిమానులు కొత్త రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుండగా.. తాజాగా చిత్రబృందం అధికారిక ప్రకటనతో క్లారిటీ ఇచ్చింది.మా ఇంటి బంగారం’ చిత్రాన్ని జూన్ 16న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సంప్రదాయ పట్టుచీరలో కనిపిస్తున్న సమంత చేతిలో తుపాకీ పట్టుకుని సీరియస్, యాంగ్రీ లుక్‌లో కనిపించడం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. పోస్టర్‌ను చూస్తుంటే సినిమాలో ఆమె పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఈ సినిమాపై మంచి బజ్ ఏర్పడగా.. తాజా పోస్టర్ ఆ హైప్‌ను మరింత పెంచింది. ముఖ్యంగా సమంత గత కొంతకాలంగా విభిన్న కథలను ఎంచుకుంటూ నటిగా కొత్త కోణాలను చూపిస్తోంది. ఈ క్రమంలో ‘మా ఇంటి బంగారం’ కూడా ఆమె కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు సంతోష్ నారాయణ్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండటం మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు సినిమాకు అదనపు బలంగా నిలుస్తాయని అభిమానులు ఆశిస్తున్నారు. ఇక సమంతకు గత కొంతకాలంగా సోలో హిట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ‘మా ఇంటి బంగారం’ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

# విడాకులకపై నటి మౌనీ రాయ్ చిరాకు

## అవాస్తవ ప్రచారాలు ఆపాలని పోస్ట్



తన భర్త సూరజ్ నంబియార్‌తో విడిపోతున్నట్టుగా వచ్చిన రూమర్లపై నటి మౌనీరాయ్ స్పందించారు. అవాస్తవాలను ప్రచారం చేయడం మానుకోవాలని సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. తమ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించొద్దని విజ్ఞప్తి చేశారు. మౌనీరాయ్, సూరజ్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో కావడంతో విడిపోతున్నారన్న ప్రచారం జరగ్గా నటి రియాక్ట్ అయ్యారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మౌనీరాయ్ కొన్ని రోజులుగా భర్తతో ఉన్న ఫొటోలు పోస్ట్ చేయలేదు. మరోవైపు, సూరజ్ నంబియార్ ఇన్‌స్టాలో పెళ్లి ఫొటోలు కూడా కనిపించడం లేదు. ప్రస్తుతం ఆయన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా అందుబాటులో లేకపోవడం గమనార్హం. అకౌంట్‌ను డిలీట్ చేసినట్టు సమాచారం. 2022 జనవరిలో సూరజ్ నంబియార్- మౌనీరాయ్ వివాహం జరిగింది. ’నాగిని’ సీరియల్‌తో ఆకట్టుకున్న మౌనీరాయ్.. ’గోల్డ్’, ’బ్రహ్మాస్త్ర’ తదితర సినిమాల్లో నటించారు. ’కేజీయఫ్ చాప్టర్ 1’ (కన్నడ), ’వేదా’ (హిందీ) తదితర చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌తో అలరించారు.



# నా ఫస్ట్ లవ్ అప్పుడే జరిగింది.. అతడు నేనంటే ఇష్టమన్నాడు.. నేను ఓకే చెప్పాను..

## అనుష్క శెట్టి కామెంట్స్..

సినీరంగంలో అగ్ర కథానాయికగా ఓ వెలుగు వెలిగిన హీరోయిన్లలో అనుష్క శెట్టి. పాన్ ఇండియా లెవల్లో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. సూపర్ సినిమాతో మొదలైన ఆమె ప్రయాణం.. అరుంధతి మూవీతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. బాహుబలి సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న అనుష్క.. గ్లామర్ పాత్రలే కాకుండా లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతోనూ మెప్పించింది. అసలు పేరు స్వీటి శెట్టి. కానీ సినిమాల్లోకి వచ్చాకా దర్శకుడు పూరి జగన్నాథ్, హీరో నాగార్జున కలిసి ఆమెకు అనుష్క అనే పేరును నామకరణం చేశారు. సినిమాల్లోకి రాకముందు అనుష్క యోగా టీచర్ గా పనిచేసింది. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో, అక్కినేని నాగార్జున సరసన నటించిన ‘సూపర్’ (2005) సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ‘విక్రమార్కుడు’ (2006) సినిమాతో ఈమెకు మంచి బ్రేక్ లభించింది. అలాగే అరుంధతి మూవీతో అనుష్కకు స్టార్ డమ్ వచ్చింది.కోడి రామకృష్ణ దర్శకత్వంలో వచ్చిన ఫాంటసీ చిత్రం ‘అరుంధతి’ (2009) లో జేజమ్మగా అనుష్క చూపించిన నటన ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. ఈ సినిమాకు గాను ఆమె నంది స్పెషల్ జ్యూరీ అవార్డు, ఫిలింఫేర్ ఉత్తమ నటి అవార్డులను అందుకున్నారు. ఆ తర్వాత ‘రుద్రమదేవి’, ‘భాగమతి’ వంటి చిత్రాలు ఆమె స్టార్ ఇమేజ్‌ను మరింత పెంచాయి. ఇదిలా ఉంటే ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్న అనుష్క.. గతంలో ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరలవుతున్నాయి.అనుష్క శెట్టి ఒక ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం, సహచర నటీనటుల గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఆమెకు ఇష్టమైన హీరోయిన్స్ జాబితాలో త్రిష, నయనతార ఉన్నారని తెలిపారు. భూమికను తన కుటుంబ సభ్యురాలిగా భావిస్తానని పేర్కొన్నారు. హీరోల విషయానికి వస్తే, నాగార్జున అత్యంత పాజిటివ్ వ్యక్తి అని, సుమంత్ తో పని చేయడం చాలా సౌకర్యంగా ఉంటుందని అనుష్క వెల్లడించారు. తన వ్యక్తిగత బలహీనత గురించి ప్రస్తావిస్తూ, తాను ఫోన్‌ను సైలెంట్‌లో పెట్టడం వల్ల తరచుగా అందుబాటులో ఉండనని, ఇది తనపై వచ్చే పెద్ద ఫిర్యాదు అని అంగీకరించారు. తన తొలి ప్రపోజల్ గురించి అడగ్గా, అది పాఠశాలలో ఆరో తరగతిలో ఉండగా జరిగిందని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో క్లాస్‌మేట్ అయిన ఒక అబ్బాయి నువ్వంటే నాకు చాలా ఇష్టం అని చెప్పగా, ఓకే అని బదులిచ్చానని అనుష్క నవ్వుతూ వివరించారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com